సాక్షి
ప్రకాశం

శనివారం । 3 । ఫిబ్రవరి । 2024



రాష్ట్రస్థాయిలోనూ సత్తాచాటాలి
ఆడుదాం ఆంధ్రా పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలోనూ సత్తా చాటాలని జేసీ గోపాలకృష్ణ పిలుపునిచ్చారు.
- 8లో..



అభివృద్ధి ప్రదాత సీఎం జగన్
రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిరంతరం కొనసాగిస్తూ సీఎం వైఎస్ జగన్ అభివృద్ధి ప్రదాతగా నిలిచారని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు.
- 8లో..

గరిష్టం/కనిష్టం
32/23

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

పేస్ కాలేజీకి ప్రతిష్టాత్మక అవార్డు



కిరణ్‌బేడీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మద్దిశెట్టి కళ్యాణ్

ఒంగోలు: తమ కాలేజీకి ప్రతిష్టాత్మక అవార్డు లభించడం ఆనందంగా ఉందని పేస్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ పేర్కొన్నారు. సింగపూర్‌లో జరిగిన ఆసియా బిజినెస్ కాన్క్లేవ్ 2024 సందర్భంగా కిరణ్‌బేడీ చేతులమీదుగా ప్రతిష్టాత్మకమైన హైలీ ప్రామిసింగ్ ఇంజినీరింగ్ కాలేజీ విత్ ఇమెన్స్ పొటెన్షియల్ అవార్డును మద్దిశెట్టి కళ్యాణ్ అందుకున్నారని పేర్కొంటూ మద్దిశెట్టి కళ్యాణ్‌కు అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ ఆర్.వీ రాంజనేయులు, డీన్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ కె.రూపా అక్కేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.రమణబాబు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఉన్నారు.

విజేతలకు నగదు బహుమతి



బహుమతులు అందజేస్తున్న కలెక్టర్

ఒంగోలు అర్బన్: నేషనల్ గర్ల్ చైల్డ్ డే సందర్భంగా డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ శుక్రవారం స్పందన హాలులో నగదు బహుమతులు అందజేశారు. ప్రతి పోటీలో ముగ్గురు చొప్పున విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి రూ.5 వేలు, రెండో బహుమతి రూ.3 వేలు, మూడో బహుమతి రూ.2 వేల చొప్పున చెక్కుల రూపంలో అందజేశారు. దీనిలో గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి మాధవీలత, మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు, సరోజిని ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేటి పరీక్ష 23కు వాయిదా

ఒంగోలు: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు శనివారం నిర్వహించాల్సిన పరీక్షను ఈనెల 23వ తేదీకి వాయిదా వేసినట్లు ఆర్‌ఐవో ఎ.సైమన్ విక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పర్యావరణ విద్య పరీక్ష నిర్వహిస్తారన్నారు. కాలేజీల ప్రిన్సిపాళ్లు ఈ విషయాన్ని గమనించి విద్యార్థులకు తెలియజేయాలన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగంలో మరో ఇరువురు

ఒంగోలు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగంలో మరో ఇద్దరిని నియమిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కంది ప్రమీలారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా రాపూరి ప్రభావతిలను నియమించారు.



తాళ్లూరులో ఈ- క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

రైతన్న మేలు కోసం..

- జిల్లాలో శర వేగంగా ఈ -క్రాప్ నమోదు
- 2.77 లక్షల ఎకరాల్లో పంటల సాగు
- 2.63 లక్షల ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు
- 95. 16 శాతం పూర్తి
- ఈ-కేవైసీ పూర్తి చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు
- ఈనెల 15న తుది గడువు

ఒంగోలు సెంట్రల్: వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. రైతుల కోసం గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వీటి ద్వారా విత్తనాలు మొదలుకొని, పంట దిగుబడి చేతికొచ్చే వరకు అన్ని రకాల సేవలు అందిస్తోంది. రైతు భరోసా ద్వారా నేరుగా వారి ఖాతాల్లో నగదు జమ చేసి సాగుకు సాయంగా నిలుస్తోంది. దీంతో పాటు అర్హులైన రైతులకు ప్రభుత్వ పథకాలు అందించాలన్న లక్ష్యంతో ఈ-క్రాప్ పేరుతో పారదర్శకతకు పెద్దపీట వేస్తోంది. వీటితో పాటు అతివృష్టి, అనావృష్టి తదితర ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం సంభవిస్తే పరిహారం చెల్లించేందుకు పకడ్బందీగా చర్యలు చేపడుతోంది. ఎంత విస్తీర్ణంలో సాగు చేశారనే వివరాలను నేరుగా రైతు పొలం వద్దకే వెళ్లి సేకరిస్తోంది. రబీలో సాగు చేసిన పంటలకు వేగంగా ఈ-క్రాప్ నమోదు చేసి, ఈ-కేవైసీ పూర్తి చేస్తున్నారు వ్యవసాయశాఖ అధికారులు. జిల్లాలో 2,77,396 ఎకరాల్లో పంటలు సాగు చేయగా 2,63,967 ఎకరాల వివరాలు నమోదు పూర్తి చేశారు. జిల్లాలో 95.16 శాతం నమోదు చేసినట్లయింది. ఈ-కేవైసీ మాత్రం కేవలం 49 శాతమే పూర్తయింది. జిల్లాలో దాదాపు 20 మండలాల్లో నూరు శాతం, 9 మండలాల్లో 95 నుంచి 99 శాతం ఈ క్రాప్ వివరాలు నమోదు పూర్తి చేశారు. నాగులుప్పలపాడు, పొన్నలూరు, కొండపి, పుల్లలచెరువు, కొండపి, జరుగుమల్లి, ఒంగోలు మండలాల్లో 80 శాతంపైగా వివరాలు నమోదయ్యాయి. నాగులుప్పలపాడులో అత్యల్పంగా 78.47 శాతం నమోదు చేశారు. ఈనెల 15న తుది గడువు కావటంతో పూర్తి స్థాయిలో వివరాలు సేకరించేందుకు వ్యవసాయశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

ఈ-క్రాప్ నమోదు చేయించుకున్న ప్రతి రైతూ తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలి. లేకపోతే పంటలు అమ్ముకునే సమయంలో ప్రకృతి వైపరీత్యాల సంభవించినప్పుడు పంట నష్టం, బ్యాంకులో రుణాలు పొందే సమయంలో ఇబ్బందులు పడే అవకాశాలు ఉంటాయి. ఆర్‌బీకేల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ-కేవైసీ చేస్తున్నారు. వ్యవసాయాధికారులు సైతం ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు.

దళారులకు చెక్:

ఈ-క్రాప్ బుకింగ్ ద్వారా రైతులకు బ్యాంకు రుణాలు మంజూరు చేస్తున్నారు. చాలా మంది దళారులు పంటలు సాగు చేయకుండానే రుణాలు పొందుతున్నారు. దీంతో నిజమైన రైతులు రుణాలు పొందేందుకు వీలు లేకుండా పోతోంది. దీనిని గుర్తించిన ప్రభుత్వం ఏయే రైతులు ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారో ఈ-క్రాప్ చేసుకుని దాని ఆధారంగా రుణాలు మంజూరు చేస్తోంది.

ఈ-కేవైసీ తప్పనిసరి



ఈ క్రాప్ నమోదు చేయించుకున్న రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలి. ఈనెల 15లోపు ఈ- క్రాప్ నమోదు, ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలి. రైతులు పంట దిగుబడులు అమ్ముకునేందుకు, ప్రకృతి వైపరీత్యాల వలన నష్టపోయిన సమయంలో ఇన్‌పుట్ సబ్సిడీ, నష్టపరిహాలకు బీమా అందాలంటే ఈ-క్రాప్, ఈ-కేవైసీ తప్పనిసరి. వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తుండటంతో గతంతో పోలిస్తే అధిక శాతం నమోదవుతున్నాయి.
– ఎస్.శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ జేడీఏ, ఒంగోలు.

ఎన్నో ప్రయోజనాలు

ఈ-క్రాప్ నమోదుతో పంట నష్ట పరిహారాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, వడ్డీ రాయితీ, రైతు భరోసా, పీఎం కిసాన్ వంటి పథకాలు వర్తిస్తాయి. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా సబ్సిడీపై యంత్రాలు పొందవచ్చు. కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరలకే విక్రయించవచ్చు. ఈ పథకాలకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన నగదు ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతుల బ్యాంకు ఖాతాలకే నేరుగా జమవుతాయి.

మార్కాపురానికి అన్నా..
గిద్దలూరుకు కేపీ

- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లుగా నియామకం



అన్నా రాంబాబు



కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం/బేస్తవారిపేట: గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబును మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిగా, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా పార్టీ అధిష్టానం శుక్రవారం రాత్రి ప్రకటించింది. అన్నా వెంకట రాంబాబు 2009, 2019లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. గత ఎన్నికల్లో ఆయన వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేసి టీడీపీ అభ్యర్థి అశోక్‌రెడ్డిపై 81,035 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. ఆ ఎన్నికల్లో అన్నా రాంబాబుకు 1,33,111 ఓట్లు రాగా, అశోక్‌రెడ్డికి 52,076 ఓట్లు వచ్చాయి. ఇక గిద్దలూరు ఇన్‌చార్జిగా నియమితులైన మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి 2019లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీచేసి మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిపై 18,667 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వీరిరువురూ మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీలు, మున్సిపాలిటీల్లో భారీ మెజారిటీతో పార్టీ అభ్యర్థులను, మద్దతుదారులను గెలిపించారు. అన్నా రాంబాబుకు మార్కాపురంలో కృష్ణచైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్(కిట్స్) ఇంజినీరింగ్ కాలేజీ ఉంది. ఇద్దరినీ ఆయా నియోజకవర్గాలకు ఇన్‌చార్జిగా ప్రకటించటం పట్ల పార్టీ శ్రేణులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇన్‌చార్జ్‌ల ప్రకటన నేపథ్యంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డితో కలిసి ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు, గిద్దలూరు నియోజకవర్గ నాయకుడు చేగిరెడ్డి లింగారెడ్డిలు శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో కలిశారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో జిల్లాకు మూడు అవార్డులు





మెమెంటో, ప్రశంస పత్రాలు అందుకుంటున్న ప్రకాశం జిల్లా విద్యార్థులు

- విద్యార్థులకు అభినందనలు తెలిపిన డీఈవో వీఎస్ సుబ్బారావు

ఒంగోలు: దక్షిణ భారత సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రకాశం జిల్లా విద్యార్థులు ఏకంగా మూడు అవార్డులను కైవసం చేసుకున్నారు. ఏపీ, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన 210 ప్రదర్శనలు విజయవాడలోని మురళి రిసార్ట్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రదర్శనకు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున ఈ ప్రదర్శనలో పాల్గొన్న మన జిల్లా విద్యార్థులు మూడు ప్రాజెక్టులలో సత్తాచాటి ఔరా అనిపించారు. విద్యార్థుల వ్యక్తిగత విభాగంలో బేస్తవారిపేట బాలుర జెడ్పీ హైస్కూలు విద్యార్థి జి.శివకౌశిక్ రూపొందించిన డ్రైవర్ యాంటీ స్లీప్ అలారం సిస్టం (దీనికి భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ వారి స్పెషల్ ప్రైజ్ లభించింది), మంగమూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి డి.సాత్విక్ రూపొందించిన హియరింగ్ త్రూ టీత్ (కర్నాటక ఎలక్ట్రిసిటీ బోర్డు వారి స్పెషల్ జ్యూరీ ప్రైజ్), విద్యార్థుల గ్రూప్ విభాగంలో మేడపి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు కె.అరుణ్‌కుమార్, ఎస్‌వి నరశింహ రూపొందించిన ఆయిల్ స్కిమ్మర్ (కర్నాటక ఎలక్ట్రిసిటీ బోర్డు వారి స్పెషల్ జ్యూరీ ప్రైజ్) అందుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులను డీఈవో వీఎస్ సుబ్బారావు తదితరులు అభినందించారు.

డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి జగన్ కృషి

- రాష్ట్ర మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



డ్వాక్రా రుణమాఫీ చెక్కు అందజేస్తున్న మంత్రి సురేష్

కొండపి (టంగుటూరు): డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి, మహిళా సాధికారికతకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారని, ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా మహిళలకు పూర్తి స్థాయిలో నాలుగు విడతలు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రుణమాఫీ చేశారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. కొండపిలోని మండల కాంప్లెక్స్ ప్రాంగణంలో శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా 4వ విడత సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం కరోనాలో కాలంలో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం అయినా కూడా సంక్షేమ పథకాలు అందించారని కొనియాడారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద నాల్గవ విడత జిల్లాలో 80 లక్షల మంది డ్వాక్రా మహిళలకు రూ.20 వేల కోట్లు, నియోజకవర్గంలో 6,057 గ్రూపులకు సుమారు రూ.200 కోట్లు రుణమాఫీ జరగ్గా ఒక్క కొండపి మండలంలో 887 గ్రూపులకు గాను 8,842 మంది డ్వాక్రా మహిళలకు రూ.6.94 కోట్లు రుణమాఫీ కింద నగదు అందించినట్లు వివరించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు డ్వాక్రా మహిళల రుణాలు రద్దు చేస్తానని మాట తప్పి చివరకు ఎన్నికల సమయంలో పసుపు-కుంకుమ పథకం కింద ఒక్కొక్కరికి కేవలం రూ.10 వేలు అందించారని విమర్శించారు. జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఎన్నికల మానిఫెస్టోను నూరు శాతం అమలు చేశారని, కానీ చంద్రబాబు ఇచ్చిన మాట ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. చంద్రబాబు తప్పిన మాటకు శిక్షగా మహిళలు టీడీపీని 23 సీట్లకే పరిమితం చేసి వైఎస్సార్ సీపీకి 151 స్థానాలు అందించారని, రాబోయే ఎన్నికల్లో కూడా మహిళలంతా వైఎస్సార్ సీపీకి అండగా నిలిచి కొండపిలో తన గెలుపునకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అంతకుముందు జిల్లా అవతరణ దినోత్సవాల్లో భాగంగా టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలకు రూ.6.94 కోట్ల చెక్కును అందజేశారు. డీఆర్‌డీఏ పీడీ వసుంధర, డీపీఎం సుబ్బారావు, ఎంపీడీవో నాగమణి, ఏపీఎం రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ మారెడ్డి అరుణకుమారి, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఢాకా పిచ్చిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆరికట్ల కోటిలింగం, పీఏసీఎస్ సొసైటీ అధ్యక్షుడు బొక్కిసం ఉపేంద్ర, మండల జేసీఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి, వైస్ ఎంపీపీ రావులపల్లి కోటంరాజు, వేముల ప్రసాద్, సర్పంచ్‌లు భువనగిరి సత్యన్నారాయణ, మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, షేక్ వన్నూరు, పరుచూరి సుబ్బయ్య, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జెడ్పీటీసీ మారెడ్డి అరుణకుమారి

డిప్యూటీ తహసీల్దార్‌కు చార్జిమెమో

చీమకుర్తి: ప్రస్తుతం చీమకుర్తిలో ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరావుకు జిల్లా కలెక్టర్ చార్జిమెమో జారీచేశారు. సంతనూతలపాడు మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన సమయంలో భూ వివాదానికి సంబంధించి తప్పుడు విధానంలో ఆన్‌లైన్ చేసినందుకు గానూ చార్జిమెమో ఇచ్చినట్లు తెలిసింది. సంతనూతలపాడు మండలం కొనగానివారిపాలెంలోని సర్వే నంబర్ 52లో 6.62 ఎకరాల భూమిని రీసర్వే చేసిన సమయంలో భూమి యజమానికి కాకుండా వేరే వారి పేరుతో ఆన్‌లైన్ చేసినట్లు గోరంట్ల నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు సంతనూతపాడు పోలీస్‌స్టేషన్లో డిప్యూటీ తహసీల్దార్‌పై కేసు నమోదైంది. దానిపై పూర్తి విచారణ చేపట్టేందుకు జిల్లా ఎస్పీ సిట్ టీమ్‌ను నియమించడంతో దానిపై కలెక్టర్ చార్జిమెమో ఇచ్చారు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావును వివరణ కోరగా, వివాదాస్పదంగా ఉన్న భూమిని ఎవరి పేరు మీద ఆన్‌లైన్ చేయలేదని, డిస్ప్యూట్‌లో మాత్రమే చూపించానని తెలిపారు. కలెక్టర్ ఇచ్చిన చార్జి మెమోకు త్వరలో వివరణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

12 నుంచి హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ

ఒంగోలు టౌన్: గ్రామీణాభివృద్ధి, స్వయం ఉపాధి శిక్షణా సంస్థ(రూడ్‌సెట్) ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 30 రోజులపాటు హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ పి.ప్రతాపరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన 18 నుంచి 45 ఏళ్ల వయసున్న వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో సంప్రదించాలని స్పష్టం చేశారు.

శిక్షణా కాలంలో ఉచితంగా భోజనం, వసతి సౌకర్యాన్ని కల్పిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9492583484ను సంప్రదించాలని సూచించారు.

లక్ష్య సాధనతో జిల్లా అభివృద్ధి చేస్తాం

- అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- జిల్లా అవతరణ దినోత్సవంలో కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ప్రకాశం జిల్లాలో సాధించాల్సిన ప్రగతి ఎంతో ఉందని లక్ష్యాలను నిర్దేశించుకుని లక్ష్య సాధనతో ముందుకు సాగి జిల్లాను అభివృద్ధి చేస్తామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. 55వ జిల్లా అవతరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ స్పందన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రతి ఏడాది ఫిబ్రవరి 2వ తేదీ జిల్లా అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించడం సంతోషకరమన్నారు. 1970లో నెల్లూరు, గుంటూరు, కర్నూలు జిల్లాలోని సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాలను ఒకటి చేసి, ఈ ప్రాంతానికి చెందిన ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులు స్వాతంత్ర్య సమరంలో పాల్గొని చేసిన త్యాగాలకు, సేవలకు గుర్తింపుగా ఆయన పేరుతో ప్రకాశం జిల్లాగా ఏర్పాటు చేశారన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా అప్పట్లో ప్రకాశం జిల్లాను ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లా అవతరణ తర్వాత జిల్లా సాధించిన ప్రగతిపై కలెక్టర్ వివరించారు. 56 మండలాల్లో జిల్లా ఏర్పడగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనా సౌలభ్యం కోసం 2022లో ప్రతి పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా ఏర్పాటు చేయడంతో పాటు 3 రెవెన్యూ డివిజన్‌లతో 39 మండలాలతో కలిపి 14,322 చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో రాష్ట్రంలో అతి పెద్ద జిల్లాగా ప్రకాశం జిల్లా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 33 శాతం మేర అటవీ ప్రాంతం ఉందన్నారు. 80 శాతం నుంచి 82 శాతం ప్రజలు వ్యవసాయం, అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. జిల్లాలో 4.47 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు, 15.25 లక్షల మంది ప్రజలకు తాగునీటిని సరఫరా చేసేందుకు రూ.8,044 కోట్లతో వెలిగొండ ప్రాజెక్టును చేపట్టారన్నారు. ఇప్పటి వరకు రూ.5,974 కోట్లు ఖర్చు చేయగా 2023 డిసెంబర్ నాటికి రెండో టన్నెల్ నిర్మాణం కూడా పూర్తి చేశారన్నారు. ఈ ప్రాజెక్టు వలన జిల్లాలోని 4 నియోజకవర్గాల్లో సాగునీరు, తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని చెప్పారు. వాటర్ స్టోరేజ్, పంపింగ్ పనులు 90 శాతం పూర్తయ్యాయన్నారు. 50 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం ఏర్పడటంతో పాటు భూగర్భ జలాల మట్టాలు పెరిగే అవకాశం ఉందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం జిల్లాలో ఒక మైలు రాయిలా చరిత్రలో నిలిచిపోతుందన్నారు. దేశంలో ఎక్కడా లభించని చీమకుర్తి బ్లాక్ గెలాక్సీ గ్రానైట్ పరిశ్రమ ద్వారా జిల్లా ఎకానమీలో 20 శాతం మేర రాబడి వస్తుందని తెలిపారు. జిల్లా పరిధిలో 4 నేషనల్ హైవేలు, ఒక ఎక్స్‌ప్రెస్ వే వచ్చిందని వివరించారు. జిల్లాలో మానవ వనరులు పుష్కలంగా ఉన్నాయని, మానవ వనరులపై ప్రత్యేక దృష్టి సారించి, సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా అవసరమైన శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సచివాలయ వ్యవస్థ ద్వారా అమలు చేస్తూ సంక్షేమ ఫలాలను నేరుగా లబ్ధిదారులకు అందజేస్తారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజల సమన్వయంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రకాశం పంతులు మునిమనవడు టంగుటూరి సంతోష్‌కుమార్‌తో పాటు రెడ్‌క్రాస్ మాజీ చైర్మన్ చుంచు చలమయ్య, ఇండియన్ ఆర్మీ హవల్దార్‌గా వీరమరణం పొందిన గని గాలయ్య సతీమణి వరలక్ష్మి, నాటక రంగం ప్రముఖులు పాటిబండ్ల ఆనందరావు, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాస్‌లను కలెక్టర్ ఘనంగా సత్కరించారు. అనంతరం జిల్లా అవతరణ దినోత్సవం నేపథ్యంలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్ జ్ఞాపికలు అందజేశారు. తొలుత కలెక్టరేట్‌లో జెండాను ఎగురవేసి ప్రకాశం పంతులు విగ్రహానికి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ మహబూబ్ బాష, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, విద్యార్థులు, పలు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, అధికారులు



ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున తదితరులు

ప్రకాశం పంతులుకు ఘన నివాళి

ఒంగోలు: ప్రకాశం జిల్లా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. 55 సంవత్సరాల క్రితం ప్రకాశం జిల్లా ఆవిర్భవించిందని, స్వాతంత్ర్య సమరయోధులు, మహామేధావి అయిన జిల్లా వాసి టంగుటూరి ప్రకాశం పంతులు పేరుమీదుగా జిల్లా ఏర్పాటైందన్నారు. ప్రకాశం జిల్లా సర్వతోముఖాభివృద్ధి చెందేలా కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వంలో భాగమైన ప్రతి ఒక్కరూ ప్రకాశం పంతులు ఆశయాల సాధనకు చిత్తశుద్ధితో కృషిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రచార కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామరాజు క్రాంతికుమార్, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ, ఓబుల్‌రెడ్డి, పరంధామిరెడ్డి, చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు క్రిష్టిపాటి శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జిల్లా అవతరణ దినోత్సవంలో దేశభక్తి గీతానికి డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

క్లుప్తంగా

ట్రాక్టర్ ప్రమాద బాధితులను పరామర్శించిన మంత్రి మేరుగు



గాయపడిన వారిని పరామర్శిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు: మద్దిపాడు సమీపంలో గురువారం పచ్చాకు ట్రాక్టర్ ట్రైలర్ తిరగబడిన ప్రమాదంలో గాయపడి ఒంగోలు కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యాదాల మాలెమ్మ, పోగులమూడి శుభాంజనేయులును శుక్రవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి మేరుగు నాగార్జున పరామర్శించారు. ఆస్పత్రి డాక్టర్లతో మాట్లాడుతూ గాయపడిన వారికి మంచి వైద్యం అందేలా చూడాలని కోరారు. ముందుగా అదే ప్రమాదంలో మృతిచెందిన సుదర్శి శోభారాణి మృతదేహాన్ని ఒంగోలు జీజీహెచ్‌కి వెళ్లి చూసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట వైఎస్సార్ సీపీ మద్దిపాడు మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, మండల ప్రధాన కార్యదర్శి, ఎంపీటీసీ వాకా కోటిరెడ్డి, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, బొమ్మల రామాంజనేయులు, పైనం ప్రభాకర్ ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కంభం: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన కంభం మండలంలోని జంగంగుంట్లలో గురువారం రాత్రి జరిగింది. అనంతపురం–అమరావతి హైవేపై జంగంగుంట్ల గ్రామ సమీపంలో అదే గ్రామానికి చెందిన పులుగుజ్జు ఏసు (50)ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. శుక్రవారం కంభం ప్రభుత్వ వైద్యశాలలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వాలీబాల్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన ఒంగోలు నియోజకవర్గం బాలుర జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జేసీ గోపాలకృష్ణ, మేయర్ గంగాడ సుజాత, కమిషనర్



వాలీబాల్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన కొండపి నియోజకవర్గం బాలికల జట్టు



షటిల్ బ్యాడ్మింటన్‌లో ప్రథమ స్థానం పొందిన కనిగిరి నియోజకవర్గ బాలికల జట్టు



షటిల్ బ్యాడ్మింటన్‌లో ప్రథమ స్థానం పొందిన ఒంగోలు నియోజకవర్గ బాలుర జట్టు

రాష్ట్ర స్థాయిలోనూ సత్తాచాటాలి

- ఆడుదాం ఆంధ్రా విజేతలకు జేసీ గోపాలకృష్ణ పిలుపు
- ముగిసిన జిల్లాస్థాయి ఆటల పోటీలు
- విజేతలకు బహుమతుల అందజేత

ఒంగోలు: ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడా జట్లు రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ సత్తాచాటాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రోనంకి గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక మినీస్టేడియంలో బుధవారం ప్రారంభమైన ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి ఆటల పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి జేసీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నైపుణ్యం గల క్రీడాకారులకు ఆడుదాం ఆంధ్రా ఒక మంచి అవకాశమని అన్నారు. ఆ ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆటల పోటీలను ప్రవేశపెట్టిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జట్లు ఈ నెల 5 నుంచి వైజాగ్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా నైపుణ్యాలు ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఆటల పోటీలు నిర్వహించడంతో పాటు అవసరమైన మౌలిక వసతులు, క్రీడాపరికరాలు సైతం ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో జేసీతో పాటు ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ మేడికొండ జస్వంత్‌రావు, జెడ్పీ సీఈవో బి.జాలిరెడ్డి, డిప్యూటీ సీఈవో హనుమంతరావు, జిల్లా క్రీడాభివృద్ధి శాఖాధికారి గుంటి రాజరాజేశ్వరి పాల్గొని ఆటల పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన నియోజకవర్గాల జట్లకు మెడల్స్, ప్రశంసపత్రాలు అందించారు.

వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్ల వివరాలు...

పురుషులు :

క్రికెట్ : దర్శి, సంతనూతలపాడు, కనిగిరి
వాలీబాల్ : ఒంగోలు, గిద్దలూరు, కొండపి
కబడ్డీ : ఒంగోలు, మార్కాపురం, సంతనూతలపాడు
బ్యాడ్మింటన్:ఒంగోలు,మార్కాపురం,కొండపి
ఖోఖో : సంతనూతలపాడు, దర్శి, యర్రగొండపాలెం

మహిళలు :

క్రికెట్ :కొండపి, సంతనూతలపాడు, మార్కాపురం
వాలీబాల్ :కొండపి,సంతనూతలపాడు, యర్రగొండపాలెం
కబడ్డీ : కొండపి, మార్కాపురం, ఒంగోలు
బ్యాడ్మింటన్ : కనిగిరి, సంతనూతలపాడు, గిద్దలూరు
ఖోఖో : కనిగిరి, వై.పాలెం, గిద్దలూరు



ఖోఖోలో ప్రథమ స్థానంలో నిలిచిన కనిగిరి నియోజకవర్గ బాలికల జట్టు



కబడ్డీలో ప్రథమ స్థానం పొందిన ఒంగోలు నియోజకవర్గ బాలుర జట్టు



కబడ్డీలో ప్రథమ స్థానం పొందిన కొండపి నియోజకవర్గ బాలికల జట్టు



క్రికెట్‌లో ప్రథమ స్థానం పొందిన దర్శి నియోజకవర్గ బాలుర జట్టు



క్రికెట్‌లో ప్రథమ స్థానం పొందిన కొండపి నియోజకవర్గ బాలికల జట్టు



ఖోఖోలో ప్రథమ స్థానాన్ని సాధించిన సంతనూతలపాడు నియోజకవర్గ బాలుర జట్టు

అభివృద్ధి ప్రదాత సీఎం జగన్

- రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి సురేష్
- రూ.8.5 కోట్లతో పృథులగిరి రోడ్డుకు శంకుస్థాపన

మర్రిపూడి: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిరాటంకంగా కొనసాగిస్తూ, అభివృద్ధికి మారుపేరుగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిలిచారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ కొనియాడారు. శుక్రవారం మండల కేంద్రమైన మర్రిపూడిలో వాటర్ ట్యాంక్ నుంచి లక్ష్మీనృసింహస్వామి కొండ వరకు అక్కడి నుంచి యానాదికాలనీ వరకు 10.8 కి.మీ మేర ఆర్ఐడీఎఫ్ నిధులు రూ.8.5 కోట్లతో నిర్మిస్తున్న తారురోడ్డుకు మంత్రి శంకుస్థాపన చేశారు. ముందుగా వైఎస్సార్ సీపీ నేతలు మంత్రి ఆదిమూలపు సురేష్‌కు ఘనస్వాగతం పలికారు. బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కరోనా విపత్తు ఎదురైనా జగనన్న ఇచ్చిన హామీలు 99 శాతం నెరవేర్చారని పేర్కొన్నారు. డ్వాక్రా మహిళలకు ప్రస్తుతం వైఎస్సార్ ఆసరా 4వ విడత సొమ్ము అందిస్తున్నామని, మరికొద్ది రోజుల్లో జగనన్న చేయూత 4వ విడత నగదును సీఎం జగనన్న బటన్ నొక్కి అందిస్తారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలను ఎంపిక చేసిన కొందరికే జన్మభూమి కమిటీలు ఇచ్చేవని, జగనన్న ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికమని గుర్తు చేశారు. గత ప్రభుత్వ పాలనకు, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని గమనించాలని కోరారు. పృథులగిరి ఘాట్ రోడ్ నిర్మిస్తామని, పొదిలి చిన చెరువు నుంచి మర్రిపూడి మండలంలోని గుండ్లసముద్రం, మర్రిపూడి చెరువులకు నీరు అందించేందుకు రూ.40 కోట్లతో అనుమతులు వచ్చాయన్నారు. సీఎంతో మాట్లాడి పనులు వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేసి వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కొండపి నియోజకవర్గ అభివృద్ధి అహర్నిశలు కృషి చేస్తానన్నారు.



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షులు, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. పృథులగిరి రోడ్డు నిర్మాణం దశాబ్దాల కల అని, అది నెరవేర్చిన మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంటకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అవతరణ దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి మంత్రి, నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో మర్రిపూడి, చిమట సొసైటీ అధ్యక్షుడు బీవీ భాస్కర్‌రెడ్డి, మాకినేని వెంకట్రావు, మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డాలి మల్లికార్జున, పార్టీ నేతలు ఇనుకొల్లు పిచ్చిరెడ్డి, బోగసముద్రం విజయభాస్కర్‌రెడ్డి, బోద రమణారెడ్డి, ఐ.సుబ్బారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పూనూరి సంజీవరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కుప్పం కొల్లారావు, సర్పంచ్ కె.భాస్కర్, బొగ్గుల శ్రీనివాసరెడ్డి, ఇనుకొల్లు మాదిరెడ్డి, పీఐయూ ఎస్ఈ కొండయ్య, ఈఈ రత్నబాబు, డీఈ శ్రీధర్‌రెడ్డి, బార్గవ కన్‌స్ట్రక్షన్స్ మధు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మోసానికి మరో రూపం చంద్రబాబు



మాట్లాడుతున్న శివప్రసాద్‌రెడ్డి, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



సమావేశానికి భారీగా హాజరైన మహిళలు

- సంక్షేమ పథకాలు ఎత్తేస్తానని చెప్పే దమ్ము చంద్రబాబుకు ఉందా?
- కరోనా విపత్తులోనూ సంక్షేమాన్ని కొనసాగించిన ఘనత సీఎం జగన్‌దే..
- వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ
- 600 హామీలిచ్చి మోసం చేసిన చంద్రబాబు అవసరమా? : బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి
- మహిళా భవన్ నిర్మాణానికి జెడ్పీ నిధులు రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటన

కురిచేడు: ఎన్నికల హామీలను గద్దెనెక్కగానే గాలికొదిలేసిన టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు మోసానికి మరో రూపమని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎత్తేస్తామని చెప్పే దమ్ము, ధైర్యం చంద్రబాబుకు ఉన్నాయా అని సూటిగా ప్రశ్నించారు. కురిచేడులోని ఏఎంసీ మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్‌తోపాటు వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై డ్వాక్రా మహిళలకు రూ.4.45 కోట్ల చెక్కు అందజేశారు. తొలుత వీరికి మహిళలు ఘన స్వాగతం పలికారు. పొట్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కోలాట ప్రదర్శన చేశారు. మహిళలతో కలిసి సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలే కాకుండా చెప్పని హామీలను సైతం సీఎం జగన్ అమలు చేశారని కొనియాడారు. నామినేటెడ్ పదవుల్లో సైతం మహిళలకు 50 శాతంరిజర్వేషన్ అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. 2014 ఎన్నికల సమయంలో 600 హామీలిచ్చిన చంద్రబాబు వాటిని అమలు చేయకపోగా మేనిఫెస్టోను ఆన్‌లైన్‌లో మాయం చేశాడని దుయ్యబట్టారు. తన కుమారుడు శివప్రసాద్‌రెడ్డికి దర్శి నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే అవకాశం ఇవ్వాలని మహిళలను కోరారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్

మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తే ఆ కుటుంబం బాగుపడుతుందని సీఎం వైఎస్ జగన్ బలంగా నమ్మారని, అందుకోసమే ప్రతి పథకం మహిళల పేరునే అందిస్తున్నారని బూచేపల్లి శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద రాష్ట్రంలోని డ్వాక్రా సంఘాలకు నాలుగు విడతల్లో రూ.25 వేల కోట్లు అందించారని తెలిపారు. ప్రజలకు పథకాలు ఇస్తే సోమరిపోతులవుతారని మాట్లాడిన చంద్రబాబుకు ఓటడిగే అర్హత ఉందా అని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలిపించుకుకోవాల్సిన అవసరముందన్నారు. దర్శి నియోజకవర్గ ప్రజలకు సేవ చేసుకునే అవకాశాన్ని తమ కుటుంబానికి ఇవ్వాలని అభ్యర్థించారు. మహిళల భవన నిర్మాణానికి జెడ్పీ నిధులు రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తల్లి వెంకాయమ్మతో కలిసి ప్రకటించారు.

కార్యక్రమంలో ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ, జెడ్పీటీసీ నుసుం వెంకటనాగిరెడ్డి, ఎంపీటీసీలు కానాల శివారెడ్డి, బుల్లం వెంకట నర్సయ్య, అన్నెం అరుణ,షేక్.కాశింబి, సర్పంచ్‌లు కేసనపల్లి కృష్ణయ్య, మాలెపాటి నాగేశ్వరరావు, కాసు భాస్కరరెడ్డి, నక్కా రామకృష్ణ, బొమ్మనబోయిన మహేష్, ఆసుపల్లి రామలక్ష్మమ్మ, బొరిగర్ల గోవింద్, సొసైటీప్రెసిడెంట్లు ఆరె శ్రీనివాసరావు, మానం కోటయ్య, పోతిరెడ్డి నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వై వి సుబ్బయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ కండె గంగయ్య, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎం బాషా, దొనకొండ, కురిచేడు జేసీఎస్ కన్వీనర్లు గుంటు పోలయ్య, మేరువ సుబ్బారెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ దేవప్రసాద్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నిమ్మకాయల రాజయ్య, ఎన్వీ నాగిరెడ్డి, మేరువ పిచ్చిరెడ్డి, ఊట్ల వెంకటేశ్వర్లు, పార్టీ ముఖ్య నేతలు, ఎంపీడీఓ సీతారామయ్య, ఈఓఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు, వైఎస్సార్ కేపీ ఏరియా కో ఆర్డినేటర్ వసుందరాదేవి, ఏపీఎం జాన్ సైమన్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో నిబంధనలు పాటించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా

ఒంగోలు అర్బన్: గత నెలలో ప్రచురించిన తుది ఓటర్ల జాబితాలో తొలగింపులు, చేర్పులు చేసే విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిబంధనలు ఉల్లఘించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ ఓటరు జాబితాలో తొలగింపులు, చేర్పులు 0.1 శాతం కంటే ఎక్కువ ఉంటే ఎన్నికల సంఘం అనుమతి తీసుకోవాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఫ్లయింగ్, స్టాటిస్టిక్ బృందాల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. ఎన్నికల విధుల్లో వినియోగించేందుకు ఎంతమేరకు సిబ్బంది అవసరం, ప్రస్తుతం ఎంతమంది అందుబాటులో ఉన్నారో ఈ నెల 10వ తేదీలోపు తెలపాలన్నారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించి ఓటర్ల జాబితాలో తొలగించాల్సిన పేర్లు 0.1 శాతం కంటే ఎక్కువుంటే కలెక్టరేట్‌కు పంపాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ శ్రీలత, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ గోపాలకృష్ణ, తదితరులు

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



నూతన కమిటీతో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, పక్కన చైర్మన్ కృష్ణ , షంషేర్ అలీబేగ్

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- మార్కాపురం ఏఎంసీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

మార్కాపురం: రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మార్కాపురం ఏఎంసీ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చైర్మన్‌గా డాక్టర్ షంషేర్ అలీబేగ్, వైస్ చైర్మన్‌గా మురళీ, డైరెక్టర్లుగా పిన్నిక లక్ష్మీప్రసాద్ యాదవ్, డాక్టర్ మక్బుల్ బాషా, ఇల్లూరి శారద, తూంపాటి ఆంజనేయులు, పేరూరి లక్ష్మీదేవి, షేక్ నూర్జహాన్, ఓర్సు పత్తెమ్మ, వేశపోగు రాజు, కోల వసంతకుమారి, శ్రీరామ్ అక్కమ్మ, చక్క సత్యనారాయణ, ఊటుకూరి సురేష్, కర్నా రమాదేవీలతో యార్డు సెక్రటరీ కోటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు గిట్టుబాటు ధర కల్పించారని పేర్కొన్నారు. నూతన పాలక మండలి రైతుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. నూతన చైర్మన్ అలీబేగ్ మాట్లాడుతూ.. మార్కెట్ యార్డు ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. ఎమ్మెల్యే కేపి నాగార్జున రెడ్డి సహకారంతో మోడల్ ఏఎంసీగా తీర్చిదిద్దుతామని చెప్పారు. మార్కెట్ యార్డులో రూ.78 లక్షలతో నూతన ఏఎంసీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కేపీ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, ఎమ్మెల్యే సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి, రాష్ట్ర ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ డైరెక్టర్ మేడా బద్రీనాథ్, ఎస్ఆర్‌సీ లేబరేటరీస్ ఎండీ డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి, ఎంపీపీ అరుణా చెంచిరెడ్డి, వ్యవసాయ శాఖ ఏడీ రమాదేవి, పార్టీ ప్రధాన కార్యదర్శులు బి.శేషయ్య, పత్తి రవిచంద్ర, కౌన్సిలర్లు డి.హర్షిత, కొత్త కృష్ణ, సిరాజ్, బి శ్రీనివాసులు, చిన్న షెక్షావలి, నాయకులు షెక్షావలి, మయూరి ఖాశీం, బూదాల గురవయ్య, ఉత్తమ్‌కుమార్, జాఫర్ బేగ్, బచ్చు జనార్దన్, తర్లుపాడు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జవ్వాజి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం షంషేర్‌ను ఘనంగా సన్మానించారు.

తండ్రి తాగొస్తున్నాడని మద్యం దుకాణానికి నిప్పు!

- త్రుటిలో తప్పిన ప్రమాదం
- నిందితుడు మానసిక రోగిగా అనుమానం

దర్శి: తండ్రి రోజూ మద్యం తాగి తల్లిని కొడుతున్నాడని ఆగ్రహానికి గురైన ఓ యువకుడు ప్రభుత్వ మద్యం దుకాణానికి పెట్రోల్ పోసి నిప్పు పెట్టాడు. ఈ ఘటన దర్శి పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. ముండ్లమూరు మండలం ఉల్లగల్లు గ్రామానికి చెందిన ముత్తుకూరి సుబ్బారావు తరచూ మద్యం తాగి కుటుంబాన్ని పట్టించుకోవడం లేదు. ప్రశ్నించిన భార్యపై దాడికి పాల్పడుతున్నాడు. తండ్రి చేష్టలతో సహనం కోల్పోయిన వంశీకృష్ణ మద్యం వల్లే తన కుటుంబం చిన్నాభిన్నం అవుతోందని భావించి రాష్ట్రంలో ఉన్న బ్రాందీ షాపులన్నింటినీ తగలబెట్టాలనుకున్నాడు. అందులో భాగంగా తొలుత దర్శి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మద్యం దుకాణంలో పెట్రోల్ పోసి నిప్పు పెట్టాడు. స్థానికులు స్పందించి మంటలార్పేలోగా వైన్ షాప్ మెస్ షీట్, కంప్యూటర్ సామగ్రి తగలబడి వెయ్యి రూపాయలు నష్టం వాటిల్లింది. నిందితుడిని స్థానికులు చితకబాది పోలీసులకు అప్పగించారు.



పోలీసుల అదుపులో నిందితుడు వంశీకృష్ణ

మతిస్థిమితం లేనట్లు సమాచారం

నిందితుడు వంశీకృష్ణ బీటెక్ పూర్తి చేశాడు. ఫైనలియర్‌లో రూ.30 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చినా చేరలేదు. ఆ తర్వాత మానసిక రోగంతో బాధపడుతూ హైదరాబాద్, గుంటూరు వైద్యం చేయించుకున్నట్లు సమాచారం. కాగా మద్యం దుకాణం సూపర్‌వైజర్ బత్తుని రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివన్నారాయణ తెలిపారు.